క్లుప్తంగా

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న మాజీ సర్పంచ్ తాతీలు

కరప: గ్రామశివారు రామకంచిరాజునగర్, నక్కావారి ఎస్సీ వీధిలోని మండల ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు మంగళవారం మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు నోట్‌పుస్తకాలు అందజేశారు. కాకినాడలోని ఆనందభారతి హైస్కూలు పూర్వవిద్యార్థులు సమకూర్చిన నోట్ పుస్తకాలను విద్యార్థులకు ఇచ్చినట్టు మాజీ సర్పంచ్ తెలిపారు.

ఉత్తమ డ్వాక్రా గ్రూపు సభ్యులకు అభినందనలు

బాలాజీచెరువు: భారత ప్రభుత్వ ప్రోత్సాహక ఆర్థిక క్రమశిక్షణ, మహిళ సాధికారితలో భాగంగా దేశ వ్యాప్తంగా జిల్లాకు రెండు గ్రూపులను ఎంపికచేశారు. ఈ డ్వాక్రా గ్రూపులు బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర మాధవపట్నం, సర్పవరం బ్రాంచ్‌లలో ఉన్న గ్రూపులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయా డ్వాక్రా గ్రూపు సంఘ సభ్యులను మంగళవారం సర్పవరం శాఖలో అభినందించారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

కాకినాడ లీగల్: న్యాయవాది గోడిపర్తి శ్రీనివాసరావుపై దాడిని తీవ్రంగా ఖండిస్తూ మంగళవారం కాకినాడ బార్ అసోసియేషన్ వద్ద న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. బార్ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి ముత్తింటి విశ్వేశ్వరరావు, చెక్క శ్రీనివాస్ మాట్లాడుతూ ఒక కేసుకు సంబంధించి క్లయింట్ కత్తితో మొవ్వ బార్ అసోసియేషన్ కార్యదర్శి, న్యాయవాది గోడిపర్తి శ్రీనివాసరావుపై దాడి చేశాడని, వెంటనే న్యాయవాదుల రక్షణకు చట్టం తేవాలని, న్యాయవాదులపై జరుగుతున్న సంఘటనలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

దోష రహితంగా ఓటర్ల జాబితా



ఓటర్ల జాబితా సవరణపై శిక్షణ ఇస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

కరప: బీఎల్‌ఓలు తమ పరిధిలోని ఓటర్ల జాబితాలో ఏమైనా తప్పులున్నా, మార్పులు, చేర్పులున్నా సరిచేసి దోష రహితంగా రూపొందించాలని తహసీల్దార్ పి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం సాయంత్రం బీఎల్‌ఓలు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బందితో ఏర్పాటుచేసిన సమావేశంలో ఓటర్ల జాబితా సవరణపై అనుసరించాల్సిన విధివిధానాలపై అవగాహన కల్పించారు. అర్హులైనవారు ఉంటే కొత్త ఓటర్లగా నమోదుచేయాలన్నారు. ఈనెల 21వ తేదీ నుంచి ఆగస్టు 20వ తేదీ వరకు ఇంటింటి సర్వే నిర్వహించి, ఎవరైనా మరణించినా, గ్రామాంతరం వెళ్లినా, చిరునామా మారినా, పేర్లలో తప్పొప్పులుంటే నిర్దేశించిన పత్రాల్లో పూర్తిచేసి, దరఖాస్తు చేయించాలన్నారు. ఆర్‌ఐ పేపకాయల మాచర్రావు తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అభయాంజనేయస్వామి

బోట్‌క్లబ్: అధిక శ్రావణ మాసం దక్షిణాయనం మొదటిరోజు మంగళవారం సందర్భంగా స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభయాంజనేయస్వామికి విశేష తమలపాకులు, గంధ సింధూర పూజ జరిగాయి. 300 మంది భక్తులతో పదకొండుసార్లు హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహించారు. అయోధ్య రామ పాదుకలు తీసుకువచ్చి భక్తులు సందర్శనార్థం ఆలయంలో ఉంచారు. ఆలయ ఈఓ బీవీఆర్ చౌదరి దంపతులు ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పులవర్తి సీతారామకృష్ణ, ముత్తా మధు, భక్తులు పాల్గొన్నారు.

ప్రచారానికే పరిమితం

- నిరుపయోగంగా ఏటీఎంలు
- పని చేయని డిపాజిట్, విత్‌డ్రా మెషీన్లు



జేఎన్‌టీయూ క్యాంపస్‌లో పని చేయని డిపాజిట్ మెషీన్లు

బాలాజీచెరువు: చెక్కులు, డిమాండ్ డ్రాఫ్ట్, బంగారు రుణాలు వంటి సేవలు మినహా డిపాజిట్, విత్‌డ్రా వంటి సేవలు ఏటీఎం (ఆటోమేటెడ్ టెల్లర్ మెషీన్)ల ద్వారా చేసుకోవాలని బ్యాంక్ అధికారులు ప్రచారం చేస్తున్నారు. ఈ సేవలకు ఏటీఎం మెషీన్‌లతో పాటు డిపాజిట్ మెషీన్లు ఉన్నాయని ఖాతాదారులకు సమాచారం వస్తున్నా అవి ఏమాత్రం పనిచేయడం లేదని ఖాతాదారులు వాపోతున్నారు. నగరంలో భానుగుడి, మెయిన్ రోడ్, కరణం గారి సెంటర్, జగన్నాథపురంతో పాటు జేఎన్‌టీయూకే ప్రాంగణంలో డిపాజిట్ మెషీన్లు ఉన్నాయి. ఈ మెషీన్లలో ఎప్పుడూ ఆఫ్‌లైన్ అని డిస్ప్లే రావడంతో ఖాతాదారులు నిరుత్సాహపడుతున్నారు. డిజిటల్ బ్యాంకింగ్, ఆన్‌లైన్, ఫోన్ పే వంటి సౌకర్యాలు ఉన్నా చాలామంది ఇప్పటికీ ఏటీఎంలను వాడుతున్నారు. ముఖ్యంగా పెన్షనుదారులు, యాభై ఏళ్లు పైబడిన వారందరూ ఏటీఎం ద్వారా నగదు పొందుతున్నారు. అత్యవసరమై వీటి ద్వారా నగదు తీసుకుందామని వస్తే అవి పని చేయక ఇబ్బందులకు గురౌతున్నామని పలువురు వాపోతున్నారు. ఈ విషయంపై ఎస్‌బీఐ ఆర్‌ఎం తపోధన్‌ను వివరణ కోరగా ఏటీఎం మిషన్లలో నగదుతో పాటు డిపాజిట్ మెషీన్లు నిరంతరాయంగా పనిచేసేలా చర్యలు తీసుకుంటామని, తరచుగా వీటిని వినియోగించడంతో హ్యాంగ్ అవుతున్నాయని తెలిపారు.

డిపాజిట్ మెషీన్ పనిచేయడంలేదు..



నగదు డిపాజిట్ చేద్దామంటే డిపాజిట్ మెషీన్ పనిచేయడం లేదు. బ్రాంచ్‌లో డిపాజిట్ మెషీన్ ద్వారా చేసుకోమంటున్నారు. వీటి ద్వారా వేద్దామనుకుంటే పనిచేయడం లేదు. బ్యాంకులో కంటే ఇక్కడే పని సులువు అవుతుందనుకుంటే ఇక్కడా పనిచేయడం లేదు.

– దేవిడ్, ప్రభుత్వ ఐటీఐ అధ్యాపకుడు

వలంటీర్లకు వందనం

తోడుగా ఉండి సేవ చేస్తున్నారు

యండమూరు గ్రామానికి చెందిన వలంటీర్ మార్శెళ్ల అరవింద్ తనపరిధిలోని కుటుంబాలకు తోడు నీడగా ఉంటూ ప్రభుత్వ పథకాలను అందజేస్తూ ఎంతో సేవ చేస్తున్నారు. సన్నకారు రైతు ఉడుం గంగారావుకు రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ వచ్చేలా చేశారు. పింఛన్ రాయించి, ప్రతి నెలా సూర్యోదయానికి ముందుగానే తలుపు తట్టి పింఛన్‌సొమ్ము చేతిలో పెడుతున్నారు. జగనన్నతోడుకు దరఖాస్తు చేయించి, కొద్దిపాటి వ్యవసాయంతో పాటు, కిరాణా దుకాణం ద్వారా ఉపాధికల్పించారు. ఆయన సేవలను మరువలేమని ఆయా కుటుంబాల వారు మెచ్చుకుంటున్నారు.



పింఛన్ ఇచ్చేందుకు బయోమెట్రిక్ తీసుకుంటున్న వలంటీర్ అరవింద్

రైతు భరోసా వచ్చేలా చేశారు



మాకు కొద్దిపాటి పంటపొలం ఉంది. రైతు భరోసా వచ్చేలా చేయడంతో ఏట రూ.13,500 వస్తున్నాయి, వర్షాలకు పంట దెబ్బతింటే ఇన్‌పుట్ సబ్సిడీ వచ్చేలా చేశారు. ప్రతినెలా ఒకటో తేదీనే పొద్దుటే వచ్చి పింఛన్ ఇస్తున్నారు. చేయూత, ఆసరా పథకాల ద్వారా ప్రయోజనం చేకూర్చారు. జగనన్న తోడు గురించి చెప్పి, దరఖాస్తు చేయించి, వడ్డీ లేకుండా రూ.10 వేలు వచ్చేలా చేశారు. వలంటీర్ అరవింద్ సేవలు సదా గుర్తించుకుంటాం.

ఉడుం గంగారావు, యండమూరు

సేవాభావంలో విజేత



ఫించన్ అందజేస్తున్న వాలంటీర్ విజేత

కాకినాడ జగన్నాథపురం 23వ వార్డుకు చెందిన వలంటీర్ ఎస్.విజేత సేవకు ప్రతిరూపంగా నిలుస్తున్నారు. ఈమెకు 62 కుటుంబాలను కేటాయించగా తన పరిధిలో అత్యధికంగా 32 కుటుంబాలకు ఇంటి పట్టాలు అందజేశారు. ప్రతి నెలా ఒకటో తేదీన 21 మందికి పెన్షన్‌తో పాటు సురక్ష కార్యక్రమంలో 72 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లు అందజేశారు. ప్రభుత్వ పరంగా వచ్చే అన్ని రకాల సేవలు అందించడంతో ముందుంటూ వృద్ధులకు, అలాగే ఒంటరిగా ఉండే కుటుంబాలకు ప్రభుత్వ సేవలు ఏమున్నా వారు అర్హులైయితే లబ్ధి పొందేలా కృషి చేస్తున్నారు. తన పరిధిలో ఉన్న వినికిడి లోపం ఉన్న రేపూరి నాగమణి తన భర్తతో కలిసి ఉంటున్నారు. డబల్ పీజీ చేసిన విజేత వాలంటీర్‌గా సేవ చేయడం చాలా సంతృప్తిగా ఉందన్నారు.

ఒకటో తేదీనే పింఛను ఇస్తున్నారు

ప్రతి నెలా 1వ తేదీ ఉదయాన్నే పింఛనును ఇంటికి తీసుకువచ్చి ఇస్తున్నారు. ముఖ్యంగా మా వార్డు పరిధిలో ఈమెకు కేటాయించిన అన్ని ఇళ్లను నెలలో ఏదో ఒకరోజు సందర్శించి ఆ కుటుంబానికి ప్రభుత్వ పరంగా అందే పథకాలను వివరించడంతో పాటు, వాటి లబ్ధి చేకూరేలా సహాయపడుతున్నారు.

– కొప్పిశెట్టి శారద

తెలుగు కీర్తి ఎస్వీఆర్

- మాజీ మంత్రి కురసాల కన్నబాబు
- ఘనంగా మహా నటుడి 49వ వర్ధంతి

కాకినాడ రూరల్: విశ్వ విఖ్యాతంగా పేరున్న మహానటుడు, తెలుగు కీర్తి ఎస్వీ రంగారావు అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. 49వ డివిజన్ నాగమల్లితోట జంక్షన్ వద్ద ఎస్వీఆర్ స్మారక సమితి అధ్యక్షుడు, రూరల్ నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం ఎస్వీఆర్ 49వ వర్ధంతిని నిర్వహించారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ఎస్వీఆర్ మనుమడు రంగారావు, తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని ఆ మహానటుడి కాంస్య విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కన్నబాబు మాట్లాడుతూ తెలుగుజాతికి ఎస్వీఆర్ కీర్తి తెచ్చారని, నటనకు ఆయన నిఘంటువులాంటి వారని అన్నారు. ఎస్వీఆర్ తెలుగు వారు కావడమే కాకుండా, కాకినాడతో ప్రత్యేక అనుభందం కలిగి ఉన్నారన్నారు. కాకినాడలో విగ్రహం ఏర్పాటు చేసినప్పటి నుంచి జయంతి, వర్ధంతిని నిర్వహిస్తూ పేద కళాకారులకు సహాయం అందిస్తున్నామన్నారు. ఎస్వీఆర్ మనుమడు రంగారావు మాట్లాడుతూ తాతయ్య వర్ధంతిని ఇంత ఘనంగా చేయడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, కురసాల సత్యనారాయణలకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. కురసాల సత్యనారాయణ మాట్లాడుతూ తెలుగు జాతి ఉన్నంత వరకు మరవలేని గొప్ప ఎస్వీఆర్ అన్నారు. స్మారక సమితి ఉపాధ్యక్షుడు బసవా ప్రభాకరరావు, ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, ఐ.శ్రీను, రాష్ట్ర సివిల్ సప్లైస్ డైరెక్టర్ జమ్మలమడక నాగమణి, రావూరి వెంకటేశ్వరరావు, శెట్టి బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ అనుసూరి ప్రభాకర్, రాజారపు కృష్ణ, కొలగాని దుర్గా ప్రసాద్, అనిశెట్టి రామకృష్ణ, బలగం ప్రసన్న కుమార్, నేమాం సర్పంచ్ రామదేవు చిన్నా, కడియాల చిన్నా, కురసాల కన్నబాబు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కాకినాడ నాగమల్లి జంక్షన్ వద్ద ఎస్వీ రంగారావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

వచ్చే నెలలో విశ్వరూపం మహాసభ



కాకినాడ, అమలాపురం ఇన్‌చార్జిలు బాధ్యతలు స్వీకరించి జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రామకృష్ణ, సత్తిబాబు తదితరులు

కాకినాడ సిటీ: ఆగస్టు రెండో వారం హైదరాబాదులో విశ్వరూపం మహాజన సభ నిర్వహిస్తున్నట్లు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, ఎంఎస్‌పి జిల్లా ఇన్‌చార్జి శెట్టే రామకృష్ణ మాదిగ, అమలాపురం జిల్లా అధ్యక్షులు వల్లూరి సత్తిబాబు, కాకినాడ నియోజకవర్గం కన్వీనర్ పలివెల నవీన్‌మాదిగ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమీపంలోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి వారు నివాళులర్పించారు. అనంతరం వీరు ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా ఇన్‌చార్జిగా నియమితులైన పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన శెట్టే రామకృష్ణ కాకినాడ నియోజకవర్గ ఇన్‌చార్జి పలివెల నవీన్ ఆధ్వర్యం ఎమ్మార్పీస్ నాయకుల సమక్షంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు.

సమాజ హితం కోసమే వేదస్వస్తి



వేదస్వస్తి నిర్వహిస్తున్న పండితులు

బోట్‌క్లబ్: సమాజంలో అన్ని వర్గాల ప్రజలు సుఖశాంతులతో జీవించాలన్న ప్రధాన ఆశయంతో కాకినాడ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతి నెలా వేద స్వస్తి నిర్వహిస్తున్నట్లు సంఘ ప్రధాన కార్యదర్శి ముంజులూరి విశ్వేశ్వరరావు అన్నారు. స్థానిక సర్పవరం జంక్షన్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం వేద స్వస్తి ప్రారంభించారు. వేద స్వస్తి ద్వారా సమాజ హితంతో పాటు ఆధ్యాత్మిక వాతావరణం పెంపొందుతుందన్నారు. సంఘ కన్వీనర్ భగవతి మహాశయ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని సంఘ అధ్యక్షులు అజ్జరపు సత్యనారాయణ మూర్తి సౌజన్యంతో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వేద పండితులు కప్పగంతుల చంద్రశేఖర శాస్త్రి, కొంపెల్ల వీరభద్ర ప్రకాశం, కందాళ సుబ్రహ్మణ్యం, ఖులుసు అయ్యప్ప, తేజోమూర్తుల సంతోషి, మూడుగుల పవన్, కపిలవాయి సురేంద్రతో పాటు పలువురు పండితులు సుమారు రెండుగంటల పాటు వేదఘోష వినిపించారు.

జగనన్న సురక్షతో ఉచితంగా ప్రభుత్వ సేవలు

కరప: ప్రజల అవసరాలు గుర్తించి, వారికి ఉచితంగా ప్రభుత్వ సేవలందించేందుకు జగనన్న సురక్ష నిర్వసిస్తున్నట్టు జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు తెలిపారు. పెద్దాపురప్పాడు గ్రామంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన దరఖాస్తుదారులకు 430 రకాల సర్టిఫికెట్లను అధికారులు, నాయకులు అందజేశారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, ఉపసర్పంచ్ బిరుదా శ్రీనివాస అప్పారావు, జిల్లా ఆహార సలహా మండలి సభ్యుడు బిరుదా చంటిబాబు, విజయరాయుడుపాలెం సర్పంచ్ వెలుగుబంటి సీతారామరాఘవ, మండల కన్వీనర్ కాదా వెంకటేశ్వరరావు, పెంకే సత్తిబాబు, ఎన్.బాలాజీ, ఎంపీడీఓ కె.అప్పారావు, డీటీ కె.అనిల్‌కుమార్, కార్యదర్శి డి.దుర్గాభవాని, వీఆర్వో ఎం.నాగేశ్వరరావు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న అధికారులు, నాయకులు

మెరుగైన సేవలకే జగనన్న సురక్ష

కౌడా ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి

కాకినాడ: ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష పథకాన్ని ప్రారంభించారని కౌడ ఛైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి పేర్కొన్నారు. స్థానిక కాకినాడ 11, 25, 33, 41 డివిజన్లలో మంగళవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమెతో పాటు వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న పాల్గొని దరఖాస్తుదారులకు ధ్రువ పత్రాలు అందజేశారు. చంద్రకళాదీప్తి మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు, పథకాలు అమలును మరింత సులభతరం చేసేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సేవల కోసం ఏ ఒక్కరూ ఇబ్బంది పడకుండా ఉండాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, మాజీ కార్పొరేటర్లు గోడి సత్యవతి, జగన్నాథన్ విజయ్‌కుమార్, గద్దేపల్లి దానమ్మ, పోలిశెట్టి పద్మావతి, నాయకులు పెదిరెడ్డి రామలక్ష్మి, బోరా వెంకటేశ్వరరావు, బత్తిన పైడిరాజు, గద్దేపల్లి దాసు, మెర్ల వరలక్ష్మి పాల్గొన్నారు.



దరఖాస్తుదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న చంద్రకళాదీప్తి, శివప్రసన్న తదితరులు

రోటరీక్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

బోట్‌క్లబ్: స్థానిక రోటరీహాల్‌లో మంగళవారం రోటరీ క్లబ్ ఆఫ్ కాకినాడ స్మార్ట్ సిటీ 2023-24 సంవత్సరానికి నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. క్లబ్ అధ్యక్షుడిగా సామంతుల అజయ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా బొజ్జవరపు మెహర్ తేజ, కార్యదర్శిగా నామాడి స్వామిశేఖర్, కోశాధికారిగా పోతుల రాంజీ, సహాయ కార్యదర్శిగా డీవీఎస్ శ్రీలక్ష్మితో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ఎస్.ఉదయభాను ప్రమాణస్వీకారం చేయించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వీసీ కె.బాబ్జీ మాట్లాడుతూ సమాజంలో నిజమైన నిరుపేదలకు గుర్తించి వారికి సహాయం చేయడం ఒక్క రోటరీ సభ్యులకే దక్కిందన్నారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా నిరుపేదలకు నిత్యావసర వస్తువులు అందించారు. సీనియర్ న్యాయవాది పలివెల వేంకటేశ్వరరావు, సీనియర్ రోటరీ సభ్యులు కూరెళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.



నిరుపేదలకు నిత్యావసర వస్తువులు అందజేస్తున్న రోటరీక్లబ్ కాకినాడ స్మార్ట్ సిటీ సభ్యులు

సమస్యల పరిష్కారానికే 'జగనన్నకు చెబుదాం'

బోట్‌క్లబ్: ప్రజా సమస్యల పరిష్కారం కోసమే జగనన్నకు చెబుదాం నిర్వహిస్తున్నామని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మహేష్‌కుమార్ అన్నారు. గాంధీనగర్‌లోని బ్రహ్మంగారి గుడివీధిలో వీధి దీపాలు లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో జగనన్నకు చెబుదాంలో భాగంగా డయర్ యువర్ కమిషనర్ లో గోడి వెంకట్ ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన కమిషనర్ వెంటనే అక్కడ వీధి దీపాలు ఏర్పాటు చేయడంతో పాటు అక్కడ ఉన్న పిచ్చి మొక్కలు తొలగించడంతో పాములు బెడద తప్పిందని ఆనందం వ్యక్తం చేశారు. తమ సమస్య చెప్పిన వెంటనే స్పందించిన కమిషనర్‌ను 41వ డివిజన్ మాజీ కార్పొరేటర్ గోడి సత్యవతి, వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గోడి వెంకట్, స్థానికులు సత్యనారాయణ, సత్తిబాబు, రంగనాథం ఆధ్వర్యంలో మంగళవారం సత్కరించారు.



కమిషనర్ మహేష్‌కుమార్‌ను సత్కరిస్తున్న బ్రహ్మంగారి గుడివీధి ప్రజలు

నిరుద్యోగులకు రీజనింగ్ మెటీరియల్ ఉపయుక్తం

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): శ్యామ్ ఇనిస్టిట్యూట్ అధినేత శ్యామ్ రూపొందించిన రీజనింగ్ మెటీరియల్ నిరుద్యోగులకు ఎంతగానో ఉపయోగపడుతుందని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. శ్యామ్ రూపొందించిన రీజనింగ్ పుస్తకాన్ని ఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఇప్పటి వరకూ రెండు తెలుగు రాష్ట్రాల్లోను ఇటువంటి క్వశ్చన్స్ విత్ సొల్యూషన్ పుస్తకం ఎవరూ రూపొందించలేదన్నారు. ఈ పుస్తకాన్ని చదివి పూర్తిగా అవగాహన చేసుకొంటే పోలీస్ ఉద్యోగాలతో పాటు జాతీయ స్థాయిలో జరిగే వివిధ పోటీ పరీక్షలకు కూడా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. శ్యామ్ ఇనిస్టిట్యూట్ అధినేత గుంటూరు శ్యామ్ మాట్లాడుతూ ఉన్నత ఉద్యోగాలు సాధించడానికి, సుదూర ప్రాంతాల్లో ఉన్న పేద విద్యార్థులు ఈ మెటీరియల్ ఎంతో మేలు చేస్తుందన్నారు. అందరికీ అర్థం అయ్యేలా పుస్తకం రూపొందించామన్నారు. ఈ కార్యక్రమంలో శ్యామ్ ఇనిస్టిట్యూట్ సిబ్బంది పాల్గొన్నారు.



రీజనింగ్ మెటీరియల్ పుస్తకాన్ని విడుదల చేస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

విస్తరణ వేగవంతం చేయండి

- కమిషనర్ మహేష్‌కుమార్
- అధికారులతో సమీక్ష

కాకినాడ: కాకినాడ జగన్నాథపురం పాత వంతెన నుంచి మున్సిఫ్ జంక్షన్ వరకు ప్రతిపాదించిన రహదారి విస్తరణ పనులను కమిషనర్ మహేష్‌కుమార్ వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ అంశంపై మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన అధికారులతో సమీక్షించారు. ప్రతిపాదనలకు సంబంధించి జరుగుతున్న ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రహదారి అభివృద్ధి ప్రణాళికను డీసీపీ హరిదాసు కమిషనర్‌కు వివరించారు. సుమారు 600 మీటర్ల మేర రహదారి విస్తరణ జరగనుందన్నారు. రహదారిని 30 నుంచి 40 అడుగులుగా వెడల్పు చేస్తున్నామని కమిషనర్ చెప్పారు. విస్తరణలో భాగంగా సుమారు వంద భవనాలను పాక్షికంగా తొలగించాల్సిన అవసరాన్ని గుర్తించారు. ఇందుకు సంబంధించి ఆయా భవన యజమానులతో కూడా సమావేశం ఏర్పాటు చేశామన్నారు. మాస్టర్ ప్లాన్‌లో ఉండే ఆస్తులు కేంద్ర ప్రభుత్వానికి చెందిన వైనా నగరపాలక సంస్థకు అప్పగించాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, డీఈ నరసయ్య, ఆర్‌అండ్‌బి ఏఈఈ లోవరాజు, జిల్లా దేవదాయశాఖాధికారి పి.నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షలో 2680 సర్టిఫికెట్ల పంపిణీ

కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ నగరంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ ప్రజలకు మంజూరైన సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఆయా డివిజన్లలో 2680 మందికి టోకెన్లు జారీ చేసి సర్టిఫికెట్లు ఇచ్చామన్నారు.

బోట్ బిల్డింగ్ యార్డు సందర్శన

కాకినాడ ఏటిమొగలోని బోట్ బిల్డింగ్ యార్డు ప్రగతిని కమిషనర్ మహేష్‌కుమార్ సందర్శించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఆయన వెంట స్మార్ట్‌సిటీ ఎస్ఈ వెంకట్రావు, డీఈ శ్రీనివాస్‌ప్రసాద్, ఏఈలు నాగసతీష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సుందరీకరణకు ప్రతిపాదనలు ఇవ్వండి

నగరపాలక సంస్థ పరిధిలోని ప్రతాప్‌నగర్ వంతెన నుంచి ఇంద్రపాలెం వంతెన వరకు రహదారికి ఇరువైపులా సుందరీకరణ చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కార్పొరేషన్ కమిషనర్ మహేష్‌కుమార్ ఆదేశించారు.

మంగళవారం ఆయన కార్పొరేషన్, నీటిపారుదలశాఖ, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ అధికారులతో ఈ అంశంపై సమావేశం అయ్యారు. నిర్దేశించిన ప్రాంతంలో ఆర్‌అండ్‌బి రహదారి ఎంతవరకు విస్తరించి ఉంది? నీటి పారుదల కాలువల సరిహద్దులు ఏమిటి? తదితర అంశాలను ఆరా తీశారు. ఆ ప్రాంత సుందరీ కరణకు అవసరమైన డిజైన్లను సిద్ధం చేయాలని కమిషనర్ కోరారు.



విస్తరణ పనుల పురోగతిపై సమీక్షిస్తున్న కమిషనర్ మహేష్‌కుమార్